క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ తెలిపారు. షంషీర్‌గంజ్, ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

ఛత్రినాక, జీఎం చావునీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు, గౌలిపురా, మేథర్‌వాడీ, తానాజీనగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

గోల్కొండ: వివిధ దేవతల వస్త్రధారణలో చిన్నారులు అలరించారు. బుధవారం కార్వాన్‌లోని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన గణనాథుడి మండపంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న, యశ్వంత్, సాయితేజ, శ్రీతేజ్‌లు వివిధ దేవతల వస్త్రధారణలో అందరిని ఆకట్టుకున్నారు.

గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపికైన మేజర్ సుప్రియ



అబిడ్స్: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని వనిత మహా విద్యాలయ అధ్యాపకురాలు ఎన్‌సీసీ అధికారి మేజర్ సుప్రియను గ్లోబల్ పీస్ అవార్డు 2023 కు ఎంపిక చేశారు. ఈ మేరకు గ్లోబల్ పీస్ అండ్ ట్రస్ట్ ఛైర్మన్ ఫారూఖ్ అలీ ఖాన్, సలహాదారులు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈ నెల 21న మేజర్ సుప్రియకు అవార్డును అందజేస్తారన్నారు.

మిధానిలో ఉచిత కంటి వైద్య శిబిరం


శిబిరంలో పాల్గొన్న డా.సంజయ్ కుమార్ ఝా

సంతోష్‌నగర్: మిధాని పరిసర ప్రాంతాల పేద ప్రజలకు వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా అన్నారు. కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లోని మిధాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మిధాని చీఫ్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఉపేంద్ర వెన్నం, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీ శంకర్ రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యరూపకం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీరామ నాటక నికేతన్ సంస్థ ఆధ్వర్యంలో గురుస్మరణే పేరిట బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన తులసిదాస్ చరితం నృత్యరూప నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. నృత్య గురువు గురు మంజుల రామస్వామి నేతృత్వంలో 73 మంది శిష్యులు ప్రదర్శించిన నృత్య రూపకం సమ్మోహన పరిచింది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి



సుల్తాన్‌బజార్: భారతరత్న డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి 107వ జయంతిని బుధవారం రామ్‌కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ మొతాలిక్ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళార్చన పేరిట లావణ్య శిష్య బృందం కర్ణాటక లోకల్, శ్వేత శిష్య బృందం హిందుస్తానీ గాయత్రి కచేరి, ఇందిరా శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు నిర్వహించారు.



డీసీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న ఉమామహేంద్ర


డబీర్‌పురాలో..


పురానాపూల్‌లో..

జై బోలో గణేష్ మహరాజ్ కీ...

గణేష్ నవరాత్రి ఉత్సవాలు కాలనీలు, బస్తీలలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు గణేష్ మండపాల్లో స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. స్థానిక నాయకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.


మీరాలమండిలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు


గణపతి పూజల్లో పాల్గొన్న గుడిమల్కాపూర్ పోలీస్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు


దత్తాత్రేయనగర్ కాలనీలో..


అజీజ్‌బాగ్‌లో..


గన్‌ఫౌండ్రీలో..


గౌలిపురాలో..


గౌలిపురా పూలబండ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద..


దారుషిఫాలో..

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

సుల్తాన్‌బజార్: యూనివర్శిటీ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని బుధవారం కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు చేసిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనతో పాటు కోఠి ఉమెన్స్ కళాశాల వద్ద రాస్తారోకోకు వెళ్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను సుల్తాన్‌బజార్ పోలీసులు అడ్డుకుని బయటకు వెళ్లకుండా యూనివర్సిటీ గేట్లను మూసివేయడంతో పోలీసులు, అధ్యాపకుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తాము రోడ్డుపై నిరసన తెలిపేందుకు అనుమతి ఇవ్వాలని అధ్యాపకులు కోరడంతో పోలీసులు ససేమీరా అన్నారు. దీంతో అక్కడా బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సింహారావు మాట్లాడుతూ.... వివిధ విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు పెన్‌డౌన్, చాక్‌డౌన్ పేరిట గత కొంత కాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నా.... ప్రభుత్వం పట్టించుకునే పాపాన పోలేదన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నారని, కాంట్రాక్టు అధ్యాపకులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రశ్నించారు. తమను వెంటనే రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, దీపికా, కాశ్లేష, ధర్మతేజ, విజయేందర్ రెడ్డి, డాక్టర్ శ్రవంతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళా విశ్వవిద్యాలయంలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఆకట్టుకుంటున్న పోలింగ్ బూత్ వినాయకుడు

గౌలిపురా: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని లాల్‌దర్వాజా నాగులచింత ప్రాంతంలో ఫ్యూచర్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వినూత్న తరహాలో వినాయకుడి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఫ్యూచర్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ వినాయకుడిని ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.


నాగులచింతలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వినాయకుడు

ఎమ్మెల్సీ కవితకు పలువురి అభినందనలు



జియాగూడ: మూడు దశాబ్దాల నుండి పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఎమ్మెల్సీ కవిత అలుపెరుగని పోరాటం చేశారని, దాని ఫలితంగానే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టారని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన అడ్‌హాక్ కమిటీ సభ్యులు శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావూరి వెంకటేష్‌లతో కలిసి ఎమ్మెల్సీ కవితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంగి కిశోర్ కుమార్, ఉమేష్ మహేష్కర్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్: పార్లమెంటు, శాసనసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం క్యాబినెట్ నిర్ణయించినందున నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషి, మల్లికార్జున్ యాదవ్‌లు కలిసి బొకే అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ : తెలుగులో యాత్రా సాహిత్యం వచ్చింది కానీ యాత్ర కవితల సంకలనం రాలేదని తెలంగాణ సాహిత్య అకాడమి ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జువ్వాడి నర్సమ్మ, యశ్వంతరావు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత జువ్వాడి దేవీప్రసాద్ రాసినటువంటి 'బ్లిస్‌ఫుల్ ర్యాంబెల్స్' అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రచయిత 48 దేశాలు తిరిగి 32 దేశాలలోని ప్రధాన కట్టడాలు, సాంస్కృతిక ప్రదేశాలు, నదులు, నగరాల గురించి కవితాత్మకంగా తన అనుభవాలను పంచుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి ఎలనాగ, ఓయూ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, భాషా సాహితీవేత్తలు దామోదర చారి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

సంతోష్‌నగర్: మొబైల్ షాపు తాళాలను పగలగొట్టి సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను దొంగిలించిన ఓ వ్యక్తిని బుధవారం ఐఎస్ సదన్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. నిలోఫర్ ఆసుపత్రి ఫుట్‌పాత్ ప్రాంతానికి చెందిన రజన్ దాస్ అలియాస్ బ్లూటూత్ (28) ఈ నెల 14న యాదగిరి థియేటర్ సమీపంలోని టచ్ మొబైల్ షాపు తాళాలను పగలగొట్టి అందులోని ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఇయర్ బడ్స్, రియల్‌మీ స్మార్ట్ వాచ్, పవర్ బ్యాంక్, సెల్‌ఫోన్ చార్జర్ అడాప్టర్, చార్జర్ కే బుల్, డీవీఆర్‌లను దొంగలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపి బుధవారం నిందితుడు రజన్ దాస్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరికి రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

గౌలిపురా: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1.17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. మోయిన్‌బాగ్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ ఖాన్ (29), మాదన్నపేట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఫెరోజ్ అలీ (25) గత కొంతకాలంగా గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. అనంతరం అవసరమైన వారికి అధిక ధరలకు గంజాయిని విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇమ్రాన్ ఖాన్, ఫెరోజ్ అలీలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1.17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం భవానీనగర్ పోలీసులకు అప్పగించారు.

న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి 20 రోజుల జైలు


మహ్మద్ సోహేల్

డబీర్‌పురా: మద్యం మత్తులో స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి నాంపల్లిలోని 6వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో యాకుత్‌పురాకు చెందిన మహ్మద్ సోహేల్ మద్యం మత్తులో స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్నాడు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అరెస్ట్ చేసి అతనిపై కేసు నమోదు చేసుకొని బుధవారం కోర్టులో హాజరు పరచగా... పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితునికి 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోంది


కార్వాన్‌లో కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గోల్కొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు ఎన్నికల హామీలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విలువనిస్తూ వస్తోందన్నారు. నియంతల రాష్ట్రాన్ని పాలిస్తున్న కేసీఆర్‌కు గద్దె దించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, రాములు, గోవింద్‌రెడ్డి, అబ్దుల్ అమీద్‌ఖాన్ తదితరులున్నారు.

మజ్లిస్ పక్కా సెక్యులర్ పార్టీ


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ పక్కా సెక్యులర్ పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకీ మిరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు మజ్లిస్ నాయకులతో సమావేశమై వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లిస్ ఏరియా కమిటి సభ్యులు నిరంతరం ప్రజా సేవలో ఉండాలని తమ ప్రాంతంలోని ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన అన్నారు. గోల్కొండ, నానల్‌నగర్, లంగర్‌హౌజ్, టోలిచౌకీ డివిజన్‌లలో ఉచిత ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తుందని దీని కోసం ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు


శ్రీరంగరావును సన్మానిస్తున్న వహీద్ అహ్మద్

గోల్కొండ: తొమ్మిదేళ్ల తన పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలంగాణ రాష్ట్ర రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ టి.శ్రీరంగరావు అన్నారు. బుధవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వహీద్ అహ్మద్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వహీద్ అహ్మద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి సెక్యూలర్ ముఖ్యమంత్రి దేశంలో మరొకరు లేరని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఫహీమ్, ముస్తఫా మోహియుద్దీన్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిర్మల్‌కుమార్

అబిడ్స్: కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన నిర్మల్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షులు నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన అన్నారు.



పోలీసుల పకడ్బందీ చర్యలు


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: గణేష్ నిమజ్జనోత్సవాలతో పాటు మిలాదున్ నబీ వేడుకలు ఒకే రోజు జరగనుండటంతో దక్షిణ మండలం పోలీసుల పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి మీర్‌చౌక్, మొఘల్‌పురా, శాలిబండ, హుస్సేనీఆలం, చార్మినార్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పాతబస్తీలోని ప్రజలు శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవడానికి వారిలో ఆత్మస్థైర్యం కలిగించడానికి తాము ఇప్పటికే భారీ బందోబస్తు కొనసాగిస్తున్నామన్నారు.

గోల్కొండలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గోల్కొండ అలిజాపూర్ వద్ద నుంచి ఈ ఫ్లాగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న భయాలు, అపోహలు తొలగించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.



గోల్కొండ ఎస్‌హెచ్‌వో ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేష్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15 నుంచి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం


జ్ఞాన్‌బాగ్ కాలనీలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న లతా మా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవి లత

అబిడ్స్: యజ్ఞ యాగాదుల నిర్వహణలో ప్రజలు సుఖ శాంతులతో జీవిస్తారని లతా మా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవిలత పేర్కొన్నారు. చారిత్రాత్మకమైన సీతారాంబాగ్ శ్రీ రామచంద్ర ఆలయంలో అక్టోబర్ 15వ తేదీ నుండి నిర్వహించే భారత భాగ్య సమృద్ధి యజ్ఞం కార్యక్రమానికి నగర నలుమూలల నుండి ప్రజలను ఆహ్వానించేందుకుగాను ఆమె నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ఈ మేరకు బుధవారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని జ్ఞాన్‌బాగ్ కాలనీ, సీతారాంపేట ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఆమె యజ్ఞంకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ.... విశ్వశాంతి కోసం ఈ మహా యజ్ఞాన్ని నిర్వహించాలని తమ ఫౌండేషన్ నిశ్చయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఠాకూర్ యమన్ సింగ్, ప్రమోద్ కుమార్, చంద్రకాంత్, విక్రమ్, రాజశేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆందోళన


ఆందోళన చేస్తున్న పలువురు మహిళలు

గన్‌ఫౌండ్రీ : నిరుపేద మహిళలకు ఇంటి స్థలం ఇస్తామని జై మహాభారత్ పార్టీ అధ్యక్షుడు భగవాన్ శ్రీ అనంత విష్ణు మోసం చేశారని పలువురు మహిళలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం రవీంద్రభారతి పక్కనే ఉన్నటువంటి జై మహాభారత్ పార్టీ కార్యాలయంలో తమకు న్యాయం చేయం చేయాలని కోరుతూ.... బాధిత మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.... పార్టీ మెంబర్‌షిప్ పేరిట రూ.300 కట్టించుకున్నారని తమకు ఇంటి స్థలం, లోన్లు ఇప్పిస్తామని మోసపూరిత హామీలు ఇచ్చినట్లు తెలిపారు. తమకు తక్షణమే న్యాయం చేయాలని భగవాన్ శ్రీ అనంత విష్ణుదాస్‌తో వాగ్వివాదానికి దిగారు. తాము అధికారంలోకి రాగానే ప్రతి నిరుపేద మహిళలకు ఇంటి స్థలం ఇస్తామని భగవాన్ శ్రీ అనంత విష్ణు వారికి తెలిపారు. అయినప్పటికి మహిళలు ఆందోళన చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మహిళలను కార్యాలయం నుంచి బయటకు పంపించారు.

నారీ లోకానికి ఇదొక నవశకం

నాంపల్లి: భారత పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టడాన్ని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాగంటి సోమయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని స్వాగతించారు. భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక అధ్యాయమని చెప్పారు. నారీ లోకానికి ఇదొక నవశకమని అభివర్ణించారు. ఈ బిల్లుపై చట్ట సభల్లో లోతైన చర్చ జరగాలని, అన్ని వర్గాలకు చెందిన మహిళలకు సమ ప్రాధాన్యం లభించాలని కోరారు.